నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్: మయూరి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ లక్ష్మీ నగర్ ఫీడర్‌లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11గంటల వరకు రత్నదీప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లైన్, నమహా అపార్ట్‌మెంట్‌లు, బుద్ధ అపార్ట్‌మెంట్‌లు, ఉదయం 11 నుంచి ఒంటి గంటల వరకు దోవా కాలనీ, అభయాంజనేయ స్వామి ఆలయం, డైనమిక్ కాలనీ, వికాస్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ కేంద్రీయ విహార్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు క్రికెట్ గ్రౌండ్ రోడ్, కొలంబస్ స్కూల్ రోడ్డు ప్రాంతాలు. 4 నుంచి 5:30 వరకు కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్‌లు, రత్నదీప్ బ్యాక్ సైడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని బాచుపల్లి ఏఈ కోరారు.

కోటేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం



కోటేశ్వర రావు

దుండిగల్: ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలకు చెందిన ప్రొఫెసర్‌కు డాక్టరేట్ లభించింది. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న బోనగిరి కోటేశ్వరరావు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ నగరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. డాక్టరేట్ పట్టాను అందుకోవడం తనకు ఆనందంగా ఉందని, తనకి సహకరించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఎల్లవేళలా సహకారం

కేపీహెచ్‌బీకాలనీ: సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ మూడో ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్ భవనంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ భవన విస్తరణకు, అక్కడి ఖాళీ స్థలాన్ని వినియోగించుకునేందుకు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.45 లక్షలు కేటాయించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు పనులు చేపట్టాలని ఆదేశించారు.

అభివృద్ధిలో సంఘాలు భాగస్వాములవ్వాలి

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు అభివృద్ధి విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు వారధిలా ఉండాలని, ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్యనగర్ సి బ్లాక్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రుద్ర అశోక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. కమిటీని ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. అభివృద్ధి విషయంలో తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గురవయ్య, ఉపాధ్యక్షుడు పాండు,



వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, కోశాధికారి అశోక్‌గౌడ్, వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు ఎత్తరి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలు బస్తీలు, కాలనీల నాయకులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. తమ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతులు కల్పించాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని హామీ ఇచ్చారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

జగద్గిరిగుట్ట: పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, డివిజన్‌లకు చెందిన అధ్యక్షులు మంగళవారం ఆయనను కలిసి సమస్యలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇటీవలే నిర్వహించిన జై హింద్ ర్యాలీ విజయవంతం చేయడానికి కృషి చేసిన వివిధ డివిజన్‌ల అధ్యక్షులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జేమ్స్, శ్రావణ్ కుమార్, డివిజన్‌ల అధ్యక్షులు ఎండీ



హరివర్ధన్ రెడ్డిని సన్మానిస్తున్న వివిధ డివిజన్‌ల అధ్యక్షులు

లాయక్, గణేష్, శివకుమార్, సంతోష్, శ్రీధర్ రెడ్డి, ఎండీ జాకీర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ నాలాపై అక్రమ నిర్మాణం!



రంగారెడ్డినగర్: వరదనీరు సాఫీగా వెళ్లేందుకు నిర్మించిన బాక్స్ నాలా అక్రమణలకు గురవుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ చెన్నారెడ్డినగర్ నుంచి రంగారెడ్డినగర్ మీదుగా శివాజీ విగ్రహం వరకు బాక్స్ నాలా ఉంది. ఈ నాలాపై ఇప్పటికే పలు డబ్బాలు వెలియగా.. తాజాగా ఓ చిన్నతరహా పరిశ్రమ నిర్వాహకుడు ముందుకు జరిగి నాలాను ఆక్రమించి దానిపై నిర్మాణం చేశాడు. నాలా ప్రాంతం జీహెచ్ఎంసీ, జీడిమెట్ల ఐలాకు సరిహద్దుగా ఉండటంతో ఇరు శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాలాపై ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పశువుల కోసం చెరువులోకి వెళ్లి బాలుడి మృతి



విష్ణు యాదవ్ (ఫైల్)

దుండిగల్: చెరువులో ఉన్న పశువులను తరలించే క్రమంలో చెరువులోకి దిగిన ఓ బాలుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. భౌరంపేట ప్రాంతానికి చెందిన చుక్కయ్య యాదవ్ వ్యవసాయం చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని కుమారుడు విష్ణు యాదవ్(16) వేసవి సెలవులు కావడంతో తమ పశువులను మేపేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గేదెలను భౌరంపేటలోని నార్లకుంట చెరువుకు తీసుకెళ్లాడు. చెరువులో ఉన్న గేదెలను ఒడ్డుకు తీసుకువచ్చేందుకు అందులోకి దిగి నీట మునిగి మృతి చెందాడు. చుట్టు పక్కల ఉన్న యువకులు గమనించి అతన్ని చెరువులో నుంచి వెలుపలికి తీసుకురాగా అప్పటికే చనిపోయాడు. ఈ మేరకు పోలీసులు బాలుడి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింతచిగురు రుచి చూద్దామా.. !



జీడిమెట్ల: ప్రకృతి సిద్ధంగా దొరికే చింతచిగురు అంటే ఇష్టపడని వారు ఉండరు. సంవత్సరంలో ఒకేసారి ఇది లభిస్తుంది. కావున చాలామంది చింతచిగురు రుచి చూడాలి అనుకుంటారు. అదే మక్కువతో జీడిమెట్లలో ట్యాంకర్‌తో నీటిని తోలే ఓ డ్రైవర్ కంటికి చింతచెట్టుకు ఉన్న చిగురు కనిపించింది. వెంటనే చెట్టు ఎక్కలేక ఏకంగా తన ట్యాంకర్‌ను చెట్టుకు దగ్గరగా ఆపి.. ఇక చిగురు తెంపడం మొదలుపెట్టాడు. దారిన పోయే ప్రతి ఒక్కరూ డ్రైవర్‌ను చూస్తూ వెళ్లారు.

చెరువు దిగువన నిర్మాణాలను పరిశీలించిన హైడ్రా



నిర్మాణాలను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని తుమర్ చెరువు దిగువ భాగాన వెలుస్తున్న నిర్మాణాలపై స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు మంగళవారం పర్యటించారు. హైడ్రాధికారి నాగరాజు నేతృత్వంలో ఇరిగేషన్ అధికారులు స్థానికంగా ఉన్న పలు నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ భూమి, నీరు నిల్వ ఉన్నచోట నిర్మాణాలు వెలుస్తున్నాయన్న ఫిర్యాదులపై ఆరా తీశారు. అక్కడ ఉన్న కొంత మంది నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపడుతున్నామని హైడ్రాధికారులకు విన్నవించారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీష్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని దయానందనగర్ బస్తీలో డ్రైనేజీ సమస్యను మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై మురుగునీరు ప్రవహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు సమస్యపై దృష్టి సారించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కంది శ్రీరాములు, అంగడి మల్లేష్, మోతుక్కార్ విజయ్‌కుమార్, మణి, చందు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

దుండిగల్: నిత్యం వ్యాయామం చేయడం ద్వారా శారీరక ధృడత్వంతో పాటు మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ప్రపంచ బై సైకిల్ దినోత్సవం సందర్భంగా మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..సైక్లింగ్ వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, నిత్యం సైకిల్ తొక్కడం వల్ల కండరాలు ధృడంగా ఉంటాయన్నారు. సైకిల్ వాడకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు.



కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ సభ్యులు భీమ్ సింగ్, గడిలా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన

దుండిగల్: భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధి డి.పోచంపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పోచంపల్లి గ్రామానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి శ్మశాన వాటిక కోసం సర్వేనెంబర్ 335లో స్థలాన్ని కేటాయించాలని మాజీ ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డి గ్రామస్తులతో కలిసి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా పలు సమస్యలను ప్రజలు రెవెన్యూ సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ మతిన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

